క్లుప్తంగా

పని సంపూర్ణంగా ఉండాలి



ములుగు : జిల్లాకేంద్రంలోని బండారుపల్లి సమీపంలో నిర్మాణం పూర్తి చేసుకున్న బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఎక్కడా ఏ చిన్న పని ఆగకుండా సంపూర్ణంగా ఉండాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ నెలలో రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ములుగు జిల్లాలో పర్యటించనున్నారని, ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఉంటుందని అన్నారు. ఆయన వెంట యువజన విభాగం నాయకుడు బైకాని సాగర్, మాదం సాగర్, నియోజకవర్గ యువజన విభాగం సమన్వయకర్త కోగిల మహేష్, తదితరులు ఉన్నారు.

ఐడీ కార్డులు పంపిణీ



వెంకటాపురం(ఎం): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఐడీకార్డులు రియల్ ఎస్టేట్ వ్యాపారి మందల వెంకటరమణారెడ్డి ఉచితంగా అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు జనగాం బాబురావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం సొంతఖర్చులతో ఐడీ కార్డులు తయారు చేయించి అందించిన వెంకటరమణారెడ్డికి హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడబోయిన అశోక్, ఎంపీటీసీ జంగిలి శ్రీలత, పోశాల అనిత, ఎస్‌ఎంసీ చైర్మన్ చీకూర్తి రమేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాసర్ల కుమారస్వామి, పీఎస్ హెచ్‌ఎం సలేంద్రం, తదితరులు పాల్గొన్నారు.

సీమంతం వేడుకలు



ఏటూరునాగారం: మండలంలోని కోయగూడ ఎల్లాపురం పంచాయతీలోని లంబాడీతండా అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సీమంతం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గర్భిణీ రమాదేవికి అంగన్‌వాడీ టీచర్లు ఫలహారాలు, పండ్లతో ఒడినింపి సీమంతాన్ని నిర్వహించారు. పుట్టబోయే బిడ్డ కోసం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దేవి, భారతి, ఆయాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా కాల్వ నిర్మాణం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 12వ వార్డులో సైడ్ కాల్వను నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ నిర్మిస్తున్నారని రాజేశ్వర్‌రావు, రఘు, రమేష్, రాజేశ్వర్‌రావు, హుస్సేన్‌లు సోమవారం తెలిపారు. 50 ఫీట్లకు అవతల కాల్వ నిర్మించాల్సి ఉండగా 43 ఫీట్లతోనే నిర్మాణం చేపట్టారన్నారు. దీంతో రోడ్డు అతిదగ్గర కాల్వ ఉందన్నారు. నిబంధనల ప్రకారం 50 ఫీట్ల తర్వాత కాల్వ ఉండాలని పేర్కొన్నారు.సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు.

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



ఎస్‌ఎస్‌తాడ్వాయి: అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దని తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వరరావు గొత్తికోయలకు సూచించారు. సోమవారం మండలంలోని కాల్వపల్లి సమీపంలోని గొత్తికోయగూడెంలో కమ్యూనిటి కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గూడెంలో ఎంత మంది నివసిస్తున్నారని ఆరా తీశారు. ఎవరైనా గూడెంలోకి కొత్త వ్యక్తులు వచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ అసాంఘిక శక్తులకు సహకరించొద్దన్నారు. మావోయిస్టుల సంచారంపై పోలీసులకు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ

వెంకటాపురం(కె): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, సమాజ అభివృద్ధికి మహిళలే కీలకమని జెడ్పీటీసీ పాయం రమణ అన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయములో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో విధాలుగా సహకారం అందిస్తుందని అన్నారు. అనంతరం జెడ్పీటీసీ పాయం రమణ, సర్పంచ్ యా మిలి, సీడీపీఓ ముత్తమ్మ, ఎంపీటీసీ సీతాదేవిలను అంగన్‌వాడీ టీచర్లు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ చీడెం యామిలి, ఎంపీటీసీ కొండపర్తి సీతాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్పవతి, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం(కె) : సీడీపీఓ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలి

ములుగు రూరల్(గోవిందరావుపేట): సమాజంలో మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలని, స్వశక్తితో ఆర్థిక అవసరాలను అధిగమించాలని ఎస్టీయు సంఘం అధ్యక్షుడు ఏళ్ల మధుసూదన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఎస్టీయూ ఆధ్వర్యంలో చల్వాయి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని అన్నారు. విద్య, వైద్యం, వ్యాపార, రాజకీయాల్లో ముందుడాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శిరుప సతీష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి సోలం క్రిష్ణయ్య, మండల అధ్యక్షుడు జన్ను సామ్సన్, స్పెషల్ ఆఫీసర్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ములుగు రూరల్ : మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన ఎస్టీయూ నాయకులు

వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ క్రాంతికుమార్ సూచించారు. సోమవారం మండలంలోని మేడారం, ఊరట్టం, నార్లాపూర్, కాల్వపల్లి గ్రామాల్లో వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి ఆయన ఇంటింటా జ్వరాలపై సర్వే నిర్వహించారు. వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి జ్వరపీడితులను గుర్తించి వైద్యపరీక్షలు చేశారు. కాల్వపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులను పరీక్షించారు. గ్రామాల్లో చికెన్ ఫాక్స్ ఆక్టివ్ కేసులు లేవన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ కలెక్టర్, కృష్ణా ఆదిత్య, డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య ఆదేశాల మేరకు గ్రామాల్లో వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రణధీర్, గౌతమ్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి గౌతమ్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

ములుగు రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని అసిస్టెంట్ లేబర్ ఆధికారి వినోదకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్‌కార్డులు కలిగి ఉన్న కార్మికుల కార్డుల్లో తప్పుల సవరణకు అధికారికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్డు కలిగిన కార్మికులు ఇన్సూరెన్స్ దరఖాస్తులు చేసుకోవడం తెలియక నష్టపోతున్నారని అన్నారు. రెండు జిల్లాలకు ఒకే కార్యాలయం కావడంతో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో జాప్యం జరుగుతుందన్నారు. భూపాలపల్లికి లేబర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో బోడ నర్సింహ, రత్నం ప్రవీణ్, బోడ కిరణ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సొసైటీ కమిటీని మార్చాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్న కమిటీ సభ్యులు

ములుగు రూరల్ : ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం మొర్రివానిగూడెం ఇసుక సొసైటీ కమిటీని మార్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ క్రిష్ణ ఆదిత్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ అధ్యక్షురాలిగా ముర్రం రామలక్ష్మీ 2013 నుంచి కొనసాగుతూ కమిటీ సభ్యులను వేధింపులకు గురి చేస్తుందని అన్నారు. కమిటీ సభ్యులకు బోనస్ డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి నూతన కమిటీని ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మడకం సారయ్య, ఎంపీటీసీ సున్నం సాంబశివరావు, సీపీఎం నాయకులు నర్సింహారావు, నగేష్, మల్లేష్, లక్ష్మయ్య, వెంకటరమణ, అంజమ్మ, రవీందర్ పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ఎంపీపీకి ఆహ్వానం అందజేస్తున్న డీఎంహెచ్ఓ

ఏటూరునాగారం: ప్రతి మహిళ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా మహిళల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ కోరారు. ఈనెల 8న రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న ఆరోగ్య మహిళ కార్యక్రమానికి హాజరు కావాలని స్థానిక జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీకి ఆయన సోమవారం ఆహ్వానపత్రికను అందజేశారు. స్థానిక ఆస్పత్రిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో రొయ్యూర్ పీహెచ్‌సీ వైద్యురాలు సుమలత, ఏదిరా పీహెచ్‌సీ డాక్టర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎస్‌ఎస్ తాడ్వాయి : తాడ్వాయికి చెందిన భూపతి సాంబమూర్తి(70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, మేడారం జాతర మాజీ చైర్మన్ కొర్నెబెల్లి శివయ్య, పార్టీ నాయకులతో కలిసి సాంబమూర్తి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబమూర్తి కుటుంబాన్ని, ఉద్యోగులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పరామర్శించి ఓదార్చారు. స్థానిక సర్పంచ్ ఇర్ప సునీల్ సాంబమూర్తి మృతి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మృతిపై మండల కేంద్రంలోని వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ చేశారు. పరామర్శించిన వారిలో ఉప సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు బండారి చంద్రయ్య, మండల మహిళా నాయకులు పుర్రి స్వరూప పాల్గొన్నారు.



మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగజ్యోతి

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యవతి



ములుగు రూరల్: కాశిందేవిపేటలో...

ములుగు రూరల్ : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాశిందేవిపేట సర్పంచ్ అహ్మద్‌పాషా అన్నారు. సోమవారం రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దేవరనేని స్వామిరావు, వైద్యాధికారి శ్రావన్‌కుమార్, అష్టమాలిక్ వినయ్, డీఈఓ మమత, హెల్త్ సూపర్‌వైజర్ ఉష, పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని మరికాలలో వైద్యశాఖ ఆధ్వర్యంలో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం సర్పంచ్ సత్యవతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి నరహరి, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

వాజేడు : ముందువెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కారు బలంగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని కొప్పుసూరు గ్రామం వద్ద బ్రిడ్జిపై చోటు చేసుకుంది. మండల పరిధిలోని సుందరయ్య కాలనీకి చెందిన సమ్మయ్య అతని కూతురు పద్మ వెంకటాపురం(కె) నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వరంగల్ వైపుకు వెళ్తున్న కారు కొప్పుసూరు బ్రిడ్జి వద్దకు రాగానే వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సమ్మయ్యకు బలమైన గాయాలు కాగా పద్మకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సమ్మయ్యను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. విషయం తెలుసుకున్న ఏటూర్‌నాగారం ఎస్సై రమేష్ తన సిబ్బందితో కలిసి కారును పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు అక్కడి నుంచి వాజేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత?

మల్హర్: మండలంలోని వల్లెకుంటలో రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న ఓ వ్యక్తిని, ట్రాలీని కొయ్యూరు పోలీసులు సోమవారం పట్టుకున్నట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. మండలంలో దేవరాంపల్లికి చెందిన వ్యక్తి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుండగా 6 నుంచి 8 క్వింటాళ్ల బియ్యంతో పోలీసులకు చిక్కినట్లు గ్రామంలో సమాచారం. ట్రాలీని, సదరు వ్యక్తిని స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలుస్తుంది. దీనిపై ఎస్సై నరేష్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు.

ప్రారంభమైన డ్రైమిక్స్ యూనిట్



జావార్ మిల్ తయారు చేస్తున్న గ్రూపు సభ్యులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని స్వయంకృషి పేరుతో నిర్మించబడిన డ్రైమిక్స్ యూనిట్ కొద్దికాలంగా మూసివేసి ఉంది. ఇటీవల ఐటీడీఏ పీఓ అంకిత్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ పోచం ద్వారా ఉత్పత్తులను మళ్లీ డ్రైమిక్స్ యూనిట్ సభ్యులు మొదలుపెట్టారు. గిరిజన ఆశ్రమ పాఠశాల పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్ అందించేందుకు డ్రైమిక్స్ యూనిట్ స్వయంకృషి జాయింట్ లైబిలిటీ గ్రూప్ సభ్యుల ద్వారా జావార్ మిల్ తయారు చేస్తున్నారు. ఇలా తయారు చేసిన జావార్ మిల్ జీసీసీ ద్వారా వివిధ గిరిజన ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసేందుకు రూపకల్పన చేశారు. ఈ గ్రూపు ద్వారా ఇప్పటివరకు 1600 కిలోల జావార్ మిల్ తయారు చేసినట్లు జీడీఎం కొండల్‌రావు తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ సెంటర్లకు న్యూట్రిషనల్ ఫుడ్ సరఫరా చేయుటకు స్వీట్ మిల్ ఇండెంట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



విద్యార్థులతో ఉపాధ్యాయులు..

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయుడు పెండ్యాల శైలేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓదెల వేణుగోపాల్, నూనె ప్రవీణ, జమున తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పర్యావరణాన్ని సృష్టించాలి

మహదేవపూర్: హోలీ పండుగ సందర్భంగా ప్రకృతి సిద్ధమైన రసాయనాలు ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని ఇకో క్లబ్ కమిటీ కన్వీనర్ రజిత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇకో క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ హోలీ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రహత్‌ఖానం మాట్లాడుతూ.. కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు టి.రజిత, కమిటీ సభ్యురాలు అఫ్రాసుల్తానా సహకారంతో రంగుల తయారీలో వాడిన మందార, బంతి, మొక్కజొన్న పిండి, గోధుమపిండి, అలోవెరా మైదాకు, మోదుగు, గులాబీ పూలు, బీట్రూట్, పసుపును గురించి విద్యార్థులు వివరించారు. ఇటీవల కెమికల్స్ కలిపిన రంగులను వాడడం వలన ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా శాశ్వతంగా చూపును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రమేష్, మున్నయ్య, విజయ్‌కుమార్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజు, రాజేందర్, రమేష్,రవీందర్, మహేష్ పాల్గొన్నారు.



ప్రకృతిపరమైన రంగులను తయారు చేసిన విద్యార్థినులు

పేద విద్యార్థులకు పుట్ట ట్రస్టు అండ



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న పద్మ



కాటారం : భోజనం వడ్డిస్తున్న శ్రీనివాస్

మహదేవపూర్: మంథని నియోజకవర్గం వ్యాప్తంగా జూనియర్, డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలుస్తుందని కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కుంభం పద్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ కాలేజీలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పెండ్యాల మమత మనోహర్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థుల ఆకలి తీర్చడమే ట్రస్టు లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్, మండల యూత్ అధ్యక్షులు ఆలింఖాన్, మాజీ మహిళ మండల అధ్యక్షురాలు అన్నమనేని అరుణ, సోషల్ మీడియా ఇంఛార్జి దబ్బెట రవీందర్, బొమ్మపూర్ సర్పంచ్ ఒడెటి పద్మ, పట్టణ మహిళ అధ్యక్షురాలు చిలుక సునీత పాల్గొన్నారు.

కొనసాగుతున్న మధ్యాహ్న భోజనం

కాటారం : పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్, ఐటీఐ కళాశాల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండగొర్ల వెంకటస్వామి భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులు అర్ధాకలితో ఉండకూడదనే ఉద్దేశ్యంతో ట్రస్టు ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రజాసేవకుడు పుట్ట మధు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ వంగళ రాజేంద్రాచారి, నాయకులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా ముందుకు సాగాలి

టేకుమట్ల: మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ముందుగా సమస్యలను గుర్తించి వారి పరిష్కార మార్గాలను అన్వేషిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అలాగే అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అధికారులు విధులపై నిర్లక్ష్యం వహించరాదని అన్నారు.



మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లారెడ్డి

హాజరు కాని అధికారులు, ప్రజాప్రతినిధులు.

మండల కేంద్రంలో ఎంపీపీ మల్లారెడ్డి ఆధర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో సభ సాధారణంగా కొనసాగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిత, తహసీల్దార్, ఎంపీఓ సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

ములుగు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎన్జీఓస్ ములుగు శాఖ తరఫున శనివారం, సోమవారం నిర్వహించిన క్రీడాపోటీలు ముగిశాయి. మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఠాకూర్ జ్ఞానేశ్వర్‌సింగ్ అన్నారు. మహిళా దినోత్సవం రోజు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోలు రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు చైతన్య, కార్యదర్శి మేఘన, ఉపాధ్యక్షుడు మహేందర్, అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సునీత, సరిత, వర్ష, జసింత పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావద్దు

భూపాలపల్లి అర్బన్: పదో తరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ధైర్యంతో ముందుకు వెళ్లి పరీక్షకు హాజరు కావాలని గెస్ట్ స్పీకర్ సదానందం బాపూజీ విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సన్‌వ్యాలీ హైస్కూల్లో సోమవారం పది విద్యార్థులకు మానసిక నైపుణ్య తరగతులను నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలపై భయాందోళన తొలగించాలని నేపథ్యంలో యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.



మాట్లాడుతున్న గెస్ట్ స్పీకర్ సదానందం